# అత్మగౌరవం
# అంతరాత్మ!



6-AK

ఆరోజు సెకెండ్ యియర్ ఎమ్. బి. బి. యస్. చదువుతున్న మావాడు ఒక స్కెలిటను కొని పట్టుకొచ్చాడు యింటికి....తలడిప్పలూ, వెన్నెముకలూ, చేతి ఎముకలూ, కాలి ఎముకలూ, మిగతా చిల్లర ఎముకలూ అన్నీ వేరు వేరు అట్టపెట్టెల్లోంచి బయటికి తీసి, గుడ్లు తేలేసి ఆశ్చర్యంతో చూస్తున్న నాకూ, పనివాళ్ళకూ ఒక్కొక్క ఎముకా చూపించి, వాటి పేర్లన్నీ ఏమిటో యింగ్లీషులో చెపుతూ, వెన్నుపూసలన్నీ ఒక్కొక్కటే తీసి ఓ తాడుకు గుచ్చడం మొదలెట్టాడు, పూలు గుచ్చినట్లు....

అప్పుడే మడిగట్టుకుని వంటింట్లోకి వెళ్ళబోతున్న మా అత్తగారు మనవడి గొంతు విని,

"ప్రొద్దున్నే ఏం కొనుక్కొచ్చావురా" అంటూ హాల్లో కొచ్చారు.

"దేవుడు చేసిన బొమ్మనే కొనుక్కొచ్చాను నానమ్మా...." అంటూ ఆమెను ఏడిపించడానికి, తలకాయ చిప్పలూ, ఎముకలూ చూపించాడు మా వాడు....మా అత్తగారు అదిరిపడి...."ఓయమ్మ—యిదేమిట్రా, ఛీ ఛీ ఛీ....యీ ఎముకలేమిటో పీడా! అవెందుకు తెచ్చావ్....అబ్బబ్బ, వాటిని తాకులాడేమిట్రా....ముందవి బయట పారేయించి వెళ్ళి స్నానం చెయ్యి" అంటూ మా అత్తగారు హడావిడి పడుతూంటే మా వాడు పడీపడీ నవ్వి,

"యివి బయట పారేస్తే ఎలాగా నానమ్మ ....యివి దొరకడం లేదు....యెంభై రూపాయలిచ్చి కొనుక్కొచ్చాను" అన్నాడు.

"శ్రీరామచంద్రా....ఏం ప్రారబ్ధంరా యిదీ..ఎక్కడో పడుండాల్సిన యీ పీడా ఎముకలన్నీ కొనుక్కురావడమేమిట్రా....అసలివి ఎందుకు తెచ్చావ్ ప్రొద్దున్నే"....

"అలా అడుగు చెప్తాను....నా చదువుకు యివి చాలా ముఖ్యంగా కావాలి. యివి చూసి నేను చాలా చదవాలి తెలిసిందా?"....

"ఓరి నీ చదువు బంగారంగానూ! యిదేం చదువురా!....దొరబిడ్డ లాగా చదివి ఏ కలెక్టరో కావలిసిన వాడివి యీ పాపిష్ఠి ఎముకలు చూసి నేర్చుకునేదేమిట్రా....ముందవన్నీ తీసి దిబ్బలో పారేస్తావా లేదా"....అంటూ ఆవేశంతో ముందుకొస్తున్న మా అత్తగార్ని చూసి మావాడు మళ్ళీ పడీపడీ నవ్వడం మొదలెట్టాడు.

"నానమ్మా, యీ పీడా ఎముకలే నీలోనూ వున్నాయి తెలుసా! యీ ఎముకలు ఎవడివో పాపం. వాడు బ్రతికుండి వస్తే యిట్లా అనేదానివా....'రా బాబూ కూర్చో' అనేదానివి.... పైన కప్పివుండే చర్మం, కండలూ, లేకుండా చూస్తే అందర్లో వుండే దీ అస్థిపంజరమే నానమ్మా....ఆడా మగా ఎముకల్లో కాస్త తేడాలుంటాయి, అంతే.... యిదుగో నానమ్మా యితని ముఖం చూశావా....నిన్ను చూసి ఎలా నవ్వుతున్నాడో చూడు"....అంటూ తలకాయ డిప్పలు పట్టుకుని మా అత్తగారి దగ్గిరికి తీసుకెళ్ళాడు....

"ఓయమ్మ, ఓనాయనా!— అవి చూస్తేనే భయంగా వుందిరోయ్! దూరంగా తీసుకెళ్లరా, నీ పుణ్యమాయిరి.... నే నిప్పుడే మడిగట్టుకున్నాను" అంటూ మా అత్తగారు భోజనాల గదిలోకి పరుగెత్తారు.

"ఎందుకు నానమ్మా, అంత భయం....నేను పట్టుకోలా....చూడు".

"అందుకేరా తండ్రీ, నాకి కంపరం.... ఎక్కడో పడుండాల్సిన పాపిష్ఠి పుర్రెలన్నీ నువు చేత్తో పట్టుకుంటే ఎట్లా చూడమన్నావురా.... యీ అస్థిపంజరాల చదువు చదవకపోతే ఏమైందిరా.... యివన్నీ ముట్టుకుంటే తిండి ఎట్టారా తినేది నువ్వూ?"

మావాడూ తేలిగ్గా నవ్వేసి,

"అలవాటైపోతుంది నానమ్మా.... నీలాగా నేనూ మడిగట్టుక్కూర్చుంటే నా చదు వెట్లా సాగుతుందనుకున్నావ్.... రేపట్నుంచి రోజూ ప్రొద్దుటే వెళ్ళి 'డిసెక్షన్' వేరే చేయాలి నేను...."

"అదేం సెషన్రా.......యీ ఎముకల చదువు కాక యింకొకటుందా ఏమిటి?"....

మావాడు మళ్ళీ నానమ్మ మాటలకు నవ్వలేక, పొట్ట పట్టుకుని,

"సెషన్ కాదు నానమ్మా! 'డిసెక్షన్' అంటే శవాన్ని కోసి శరీరంలో వుండే విషయాలూ, విశేషాలూ తెలుసుకొని చదవాలి" అని మావాడు చెప్తూంటే మా అత్తగారు "ఏమిటి" అంటూ ఒక్క క్షణం కొయ్యబారి నిలబడిపోయారు....

"ఎంత ఘోరం....ఎంత ఘోరం! శవాన్ని కొయ్యడమా? అది చదువా ?"

"అవున్నానమ్మా. మరి డాక్టర్లు కావాలంటే వూరికే అనుకున్నావా?"

"నే చూసేదం ఏమిట్రా లక్షణంగా పుస్తకాలు చదివి డాక్టర్లు కాలేదట్రా ..అయినవాళ్ళంతా యిట్లాగే అయినారా....యీ కాలం చదువు లిట్లా అయినాయిగానీ."

"అయ్యో నానమ్మా, అందరూ యిట్లా చదివే డాక్టర్లయినారు." మావాడు మళ్ళీ నవ్వడం మొదలెట్టాడు.

"ఏంగాదు....నాకు తెలిసి ఎంతమంది డాక్టర్లను నేను చూళ్ళేదు.... పుస్తకాల్లో [illegible] ఏంమందు ఎప్పుడివ్వాలో, ఎట్లా యివ్వాలో పెద్ద డాక్టర్ల దగ్గరికి వెళ్ళి అడిగి తెలుసుకో...."

"అట్లా డాక్టర్లను అడిగి ఏంమందు యివ్వాలో తెలుసుకుని యిస్తే కాంపౌండర్ని అవుతానుగాని, నానమ్మా....డాక్టర్నెట్లా అవుతాను...." మావాడు నవ్వలేక అలిసిపోయాడు.

"కాకపోతే ఏమీ అంట. నేను మొదట్నే చెప్పాను. బిడ్డను లక్షణంగా కలెక్టరుకు చదివించమని....మీ అబ్బ వినేదు. ప్రొద్దున్నే వెళ్ళి, ఏ దిక్కుమాలిన పీడాకారాన్నో కోస్తూ, ఆ పాపిష్టి ఎముకలు ముందేసుకుని యీ చదువు చదవకపోతే ఎవడడిగాడూంట? వాడికి లేకపోతే నీకైనా జ్ఞానం వుండక్కర్లా. బిడ్డని యిట్లాంటి చదువా చదివించేది"....అంటూ మా అత్తగారు నావైపు తిరిగారు.

హతోస్మి ! ఏంచెప్పేది నా అవస్థ! ఆమెలాగే నేనూ మావాడు చెప్పిందంతా విని మతిపోయి నిలబడ్డాను. 'బిడ్డను యిలాంటి చదువు చదివిస్తున్నామే'....అనే బాధ ఓవైపూ, రేపు వాడు పెద్ద డాక్టర్ అవుతాడనే సంతోషం యింకోవైపూ పెనవేసుకుని, ఏం మాట్లాడాలో తెలీని అయోమయ స్థితిలోవున్న నన్ను చూసి మావాడు-

''ఏమ్మా, నీకూ భయంగా వుందా'' అని అడిగాడు. మా అత్తగారే అందుకున్నారు:

''భయం ఏమిట్రా, కంపరం పుట్టుకొస్తుంటేనూ....ముండా ఎముకలన్నీ తీసి డబ్బాలో పారేస్తావా లేదా?''

''నానమ్మా, నువ్వు నిజాన్ని చూసి భయపడుతున్నావ్....మనలో వుండేవీ యిట్లాంటి ఎముకలే''....

''వూరుకోరా పిచ్చికుంకా. మాటిమాటికీ ఆ పీడా ఎముకలకీ, మన ఎముకలకీ పోలుస్తావ్!''

''సారీ నానమ్మా....అన్నట్లు నీలో వుండే ఎముకలు మడి ఎముకలు గదూ....కాని. వాటి ఆకారం గూడా యీ ఎముకల్లాగే....''

''ఛాల్లే వూరుకో....మళ్ళీ అదేమాట....ముందవన్నీ తీసి బయట పారేస్తావా లేదా! ఛీ ఛీ ఛీ....యిదొక చదువా? నేనింకా అన్ని చదువుల్లాగే ఆడుతూ పాడుతూ పుస్తకాలు చదివి డాక్టర్లవుతా రనుకున్నానుగానీ, యిట్లా ఎముకలు పట్టుకుని వూరేగుతారని తెలిస్తే ఆరోజే ఒద్దనేదాన్ని.... యింతకైనా యీ డాక్టర్ చదువు మానేసి కలెక్టర్‌కు చదువు. నాకేం బాగా లేదీ చదువు.''

''సరేలే నానమ్మా, నాన్న వచ్చాంతర్వాత నేనేం చదవాలో చెప్పు'' అంటూ మావాడు అవన్నీ తీసుకుని మేడమీది కెళ్ళబోయాడు.

''అవెక్కడికిరా....ముండా పీడావన్నీ తీసుకెళ్ళి పెరట్లో పారెయ్. పనివాళ్ళకు చెప్పి ఎక్కడన్నా తీసుకెళ్ళి పడేసిరమ్మంటాను'' అంటూ మా అత్తగారు అడ్డుతగిలారు....మావాడు ఒక్కక్షణం ఆలోచించి,

"సరే నానమ్మా, పెరటివేపు పడేస్తాను. పనివాళ్ళక్కర్లేదు.... నేను డబ్బిచ్చినవాడే వచ్చి తీసుకెళ్తాడు, చెప్తే....వాడికి కావాలి యివి'' అంటూ అవన్నీ తీసుకుని పెరటివేపు వెనుక మెట్లమీదినుంచి మేడమీది కెళ్ళాడు....

మొదటి సంవత్సరం మావాడు ఏం చదువుతున్నదీ మా అత్తగారికి తెలీదు విషయాలు. అసలు డాక్టర్ చదువంటే ఏమిటోగూడా ఆమెకు తెలీదు. కాని మనవడు డాక్టర్ కాబోతున్నాడంటే తనకు మందులిస్తాడు, తనింకే డాక్టర్ దగ్గిరికీ వెళ్ళక్కర్లేదు...అంటూ మురిసిపోయేది. అసలు తనపుట్టింటి వేపూ, అత్తింటివేపూ కూడా డాక్టర్లయిన వాళ్ళు ఎవరూ లేరు. అంతా స్కూలు మేష్టర్లూ, ఇనస్పెక్టర్లూ తప్ప....తన మనవడు కలెక్టరు కావాలని ఆమెకు చాలా కోరికగా వుండేది. ఆమె కలెక్టరు తర్వాత రెండవస్థానం డాక్టర్ కే యిచ్చేది. ''అయితే కలెక్టరు, లేకపోతే ఉడ్డు దొరంత పెద్దడాక్టరు కావాలె నా మనవడు'' అంటూండేది మా అత్తగారు.

* * *

ఉడ్డుదొర ఆమె తల్లిగారివూర్లో వుండే అమెరికన్ హాస్పిటల్ డాక్టర్. ఆమె పసేండ్లపిల్లగా వున్నపుడు ఉడ్డుదొరను 'జిడ్డుదొర' అని ఎగతాళి చేసేదట.. ఆమె తల్లిదండ్రులు ఉడ్డుదొరను అట్లా అనగూడదనీ, దేవుడి తర్వాత ఉడ్డుదొరే దేవుడనీ చెప్పేవారట. ఎంతటి జబ్బునైనా ఆయన యిట్టే నయం చేసేవాడట. ఉడ్డుదొర పేరు ఆ వూరు చుట్టుప్రక్కలే కాకుండా, ఎక్కడెక్కడికో పాకిపోయిందట. కొన్ని వందల మైళ్ళ దూరాన్నుంచి వచ్చేవారట, ఎంతకీ నయంగాక మొండికి పడ్డ జబ్బుల వాళ్ళంతా ఉడ్డుదొరను వెతుక్కుంటూ. మా అత్తగారి పెళ్ళయ్యేప్పటికే ముసలివాడైన ఉడ్డుదొర ఇంగ్లాండు వెళ్ళిపోయాట్ట. మా అత్తగారి అభిమానం చూరగొన్న ఏకైక డాక్టర్ ఉడ్డుదొర. ఆమె ముందు యింకెవర్నీ 'పెద్ద డాక్టర్' అనేవాళ్ళం కాదు. అంటే ఉడ్డుదొర పేరు తీసుకొచ్చేవారు.

* * *

"అంతటి డాక్టర్ మీ మనవఁడు కావాలనేగా మీరు కోరుకున్నారు! ఉడ్డుదొర గూడా యిలాంటి చదువు చదివేగా అంత పెద్ద డాక్టరయినాడు" అన్నాను, మా అత్తగారికి కాస్త నచ్చచెప్పి చూదాం అని....

"ఆ కాలంలో యిట్లాంటి చదువు లుండేవే కాదు-ఉడ్డుదొర యిట్లా అంతా చేసేవాడు కాదుగానీ, రణాలూ, కడుపులో బల్లలూ, ఆపరేషన్ చేసి తీసేసేవాడు....చచ్చేవాళ్లను బ్రతికించేవాడు. యిట్లా చచ్చినవాళ్ళను కోస్తూ కూర్చుండేవాడు కాదు" అన్నారు మా అత్తగారు. యింకేం చెప్పేది ఆమెతో. ఆపూట జరిగిన గాథంతా కొడుకు ద్వారా తెలుసుకున్న మావారు భోజనానికి యింటికి రాకుండా ఆఫీసుకే పంపించమని ఫోన్‌చేశారు. ఆమె ఆవేశం తగ్గిందాకా కంటబడి లాభంలేదని.

దేవుడు రక్షించాడా అన్నట్లు మా బావగారొచ్చారు, మా బంధువు లింటి పెండ్లికి. కుశల ప్రశ్నల్లో మా అత్తగారు కాసేపు మనవఁడి చదువు విషయం మరిచిపోయారు. మా వాడు వాళ్ల నానమ్మ కంటబడకుండా దొంగలా కాలేజీకి వెళ్ళొచ్చాడు. మా బావగారు రాగానే కనిపించక తప్పలేదు. "మా వంశానికంతా నువ్వొక్కఁడివేనోయ్ డాక్టరువి! మిగతా అందరూ బడి పంతుళ్ళే....బాగా చదువుతున్నావా ?" అంటూ మా బావగారు మా వాడిని పక్కన కూర్చోబెట్టుకుని మాట్లాడుతూంటే మా అత్తగారు అందుకున్నారు, వంటింట్లోంచి వస్తూ....

"ఆ, చదువుతున్నాడు...వాడు చదివే చదువేంటో తెలిస్తే నువ్వీ పూట అన్నం తినవు. నిద్రపోవు....ఒరేయ్ నరం పుస్తకాలు చదివి డాక్టర్లయింది నీ కాలంలోనూ, నా కాలంలోనూరా....యీ కాలం చదువులే మారి పోయినయ్ ..నువ్వైనా చెప్పరా వాడికి, డాక్టరు చదువు మాన్పించి, కలెక్టరుకు చదివించమనీ" అని మా అత్తగారు చెప్తూంటే మా బావగారు ఆమె ఏం చెప్తోందో అర్థంగాక అయోమయంగా నావైపు చూశారు.... మావాడు నవ్వుకుంటూ, స్నానం చేసివస్తానని పైకి వెళ్ళాడు....నేను మా బావగారికి జరిగిన సంగతంతా చెప్పాను. మా అత్తగారు మధ్య మధ్య అడ్డుతగుల్తూ,

డాక్టర్ చదువు యీ కాలంలో ఎంత ఘోరంగా పరిణమించిందో వివరిస్తూ వుంటే....

అంతా విన్న మా బావగారు నవ్వి, "అదా సంగతి.... ఇంతకీ నువ్వనేదేమిటి కక్కీ.... ఆ కోత పనులు చేయకుండా, ఎముకలు ముట్టుకోకుండా చదవాలంటావు. అంతేనా?"

"అంతేరా.... లక్షణంగా పుస్తకాలు చదువుకుని డాక్టరయితే నాకేం బాధరా"....అన్నారు మా అత్తగారు.... నిట్టూర్పు విడుస్తూ....

"అసలు నువ్వెందులో బాధపడాల్సిందేముంది కక్కీ....శరీరతత్వం తెలుసుకోకుండా డాక్టర్లెట్లా అవుతారు....మందులెట్లా యిస్తారు...."

"ఒరేయ్, నువ్వూ అట్లాగే మాట్లాడతావేమిట్రా! తెలీకడుగుతా, కటిక కసాయివాళ్ళు చేయాల్సిన పన్లన్నీ పసిబిడ్డ చేస్తూంటే ఎట్లా మనసొప్పుతుందిరా, ఆ చదువు చదివించడానికి? శరీరతత్వాలు బాగా తెలిసిన పెద్ద డాక్టర్ల దగ్గిరికెళ్ళి అడిగి తెలుసుకుంటే సరి"....అని ఆమె చెప్తూంటే మా బావగారు పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వి, "అలాగే కక్కీ, నువ్వు చెప్పినట్లే చేద్దాం.... అబ్బాయితో మాట్లాడతాలే" అంటూ లేచి నిలబడ్డారు.

"అప్పుడే ఎక్కడికిరా....వాళ్ళింట్లో పెళ్ళి రేపుగదూ...." అని అడిగారు మా అత్తగారు.

"పెళ్ళింటికి కాదు కక్కీ .... హరికథ వినడానికి.... మా వూరివాడే చంద్రమౌళి శాస్త్రుల్లు....బాగా చెప్తాడులే .... బాగా చదువుకున్నవాడూ, వేదాంతం అంటే ఏమిటో క్షుణ్ణంగా తెలిసినవాడూనూ. అన్నట్టు, వస్తావా కక్కీ.... తీసుకెళ్తాను, నువ్వు ముఖ్యంగా వినాల్సిన విషయాలు చాలా చెప్తాడు" అన్నారు మా బావగారు ఉత్సాహంగా.

"అంతకంటేనట్రా. యీ కట్టె కడుపుకు యింత వండిపడేయడం తప్ప అట్లాంటి వేదాంత విషయాలు చెవున పడేసుకునే అవకాశం ఏదీ— నేనుగా ఎటూ వెళ్ళేదిలేదు. నువ్వు తీసుకెళ్తానంటే రానంటానా....తప్పకుండా వస్తా...."అంటూ, నన్నుకూడా రమ్మని బలవంతం చేశారు మా

అత్తగారు. మా బావగారుగూడా బ్రతిమాలడంవల్ల నేను కూడా బయల్దేరక తప్పలేదు.

హరికథ ఆరంభం అయింది. ముందు వెళ్ళగానే మా బావగారు లోపలికెళ్ళి హరికథ చెప్పే శాస్త్రిలతో కాసేపు మాట్లాడివచ్చారు. శాస్త్రులు గారు హరికథ ప్రారంభిస్తూనే, "శీర్యతీతి శరీరం-అంటే శరీరం నశించే స్వభావం గలది—'' అంటూ మొదలెట్టారు.... వెంటనే మాబావగారు నావైపు చూసి "విన్నావా అమ్మా .... మన కక్కి వినాల్సిన విషయమే ఆరంభించాడు'' అన్నారు, భావగర్భితంగా నవ్వుతూ.... మా అత్తగారు మా మాట వినే ధ్యాసలోలేదు.... శాస్త్రిల్లుగారు ఏంచెప్తారో వినే ఉత్సాహంతో ఇంకా స్త్ర ముందుకు జరిగి కూర్చున్నారు.

*     *     *

"శరీరం నశించేదైనా ఆత్మ నశించదు. ఆత్మకు చావులేదు. అది కేవలం పరమాత్మస్వరూపం! ప్రపంచంలో వుండే మానవులందరిలోనూ ప్రకాశించేది ఆ పరమాత్మస్వరూపంయొక్క ప్రతిబింబమే.... ఉదాహరణకు సూర్యుడు వున్నాడు. ఎదురుగా అద్దం పెడితే, ఆ అద్దంలోనూ సూర్యుడు కనిపిస్తాడు, కాని అది సూర్యుని ప్రతిబింబమే. యిద్దరు సూర్యుళ్ళు కారు. అలాగే ఆ అద్దం పగిలి సహస్ర తునకలయిందనుకోండి. ఆ వెయ్యి అద్దం ముక్కల్లోనూ వెయ్యి సూర్యులు కనిపిస్తారు. అవన్నీ ప్రతిబింబాలే. సూర్యుడొక్కడే. అలాగే ఒకే పరమాత్మ స్వరూపం ప్రతీ మానవుడిలోనూ ప్రతిబింబిస్తుంది. అదే ఆత్మ. సాక్షాత్ పరమాత్మ ప్రతిబింబమైన ఆత్మ నివసించే దేవాలయమే మన దేహం. అందుకే 'దేహో దేవాలయః ప్రోక్తః....' అన్నారు."

"ఆహాహా! ఏం బాగా చెప్తున్నాడ్రా నరం, అన్నీ అమృతవాక్కులే" అంటూ మా అత్తగారు ఆనందపడిపోయారు.

"ఏ విధంగా అయితే అందరిలోనూవుండే ఆత్మ ఒకే స్వరూపమో అలాగే మన శరీరాలు కూడా పైకి రూపభేదాలు కనిపించినా, మన లోప

లున్న అస్థిపంజరాలన్నీ ఒకే విధంగా ఉంటాయి. అస్థిపంజరం అంటే దేవుడు లేని శిథిల దేవాలయం అన్నమాట- దేవుడు లోపలవున్నా, లేకున్నా చూస్తూ చూస్తూ శిథిల దేవాలయమేగదా అని కాల్తో తంతామా ?''

"అయ్యొయ్యో, అపచారం.... అపచారం...." మా అత్తగారు రెండు చెంపలూ వాయించుకున్నారు.

"ఆ విధంగానే జీవుడులేని అస్థిపంజరాన్ని కూడా మనం అసహ్యించు కోరాదు. ఆ విధంగా అసహ్యించుకున్న వారికి రౌరవాదినరకం అని వ్రాసుంది శాస్త్రంలో. ఎందుకంటే మన అందరిలోనూ ఉండేది ఒకే రకమైన అస్థిపంజరం కాబట్టి దాన్ని చూసి అసహ్యించుకోడం అంటే మనల్ని మనం అసహ్యించుకున్నట్లే. అసలు అది తెలుసుకోడమే జ్ఞానియొక్క లక్షణం. పరమయోగి అయిన వేమన స్మశానంలో అస్థిపంజరాలు చూసి 'ఎప్పటికైనా మనం అంతా యింతే గదా' అంటూ పరమయోగి అయినాడు. గొప్ప గొప్ప వేదాంతులంతా మానవసేవ చేసి అదే మాధవసేవ అనుకుని తరించారు. దాన్ని మించిన పుణ్యం మరొకటి లేదని కూడా చెప్పారు పెద్దలు. ఉదాహరణకు- డాక్టర్లున్నారు.... వాళ్ళు నిజంగా ప్రత్యక్ష దేవుళ్ళనే చెప్పాలి. ఒక విధంగా ఆలోచిస్తే అసలు వాళ్ళే నిజమైన యోగులూ, త్యాగులూనూ.... ఎంత పెద్ద జబ్బయినా, ఎంతటి భయంకరమైన చీము, రక్తాలతో కూడిన రణమైనా అసహ్యించుకోకుండా సేవచేసి, నయంచేసి, బాధ పోగొట్టి బ్రతికిస్తారు.... డాక్టర్లే అసహ్యించుకుంటే ఇక రోగుల గతేమిటి ? అసలు డాక్టర్లు కాదలచుకున్న వాళ్ళు ముందు భయమూ, అసహ్యమూ ముడుపుకట్టి మూలబడెయ్యాలి. మృతదేహాలనూ, అస్థిపంజరాలనూ చూసి మానవ శరీర నిర్మాణం తెలుసుకుని, దాని లోటుపాటులు అవగాహన చేసుకుని కష్టపడి చదువుతారు. భగవంతుడు పుణ్యాత్ములని చేరదీసి, పాపాత్ములని అసహ్యించుకుంటే మనుష్యుల గతేమిటి.... అలాగే డాక్టర్లు కూడా....డబ్బు సంపాదనతోబాటు డాక్టర్లకు పరమార్థం కూడా వున్నది.

మంచి డాక్టరు గొప్ప డాక్టరు అనిపించుకోవాలంటే పూర్వజన్మ సుకృతం గూడా వుండాలి. ఎందుకంటే బీదలకు వైద్యసహాయం చేస్తూ, స్వార్థమూ, సోమరితనమూ లేకుండా, ఎటువంటి సందర్భాల్లోనైనా సరే 'సిరికింజెప్పడు' అన్నట్లు అర్ధరాత్రి అయినా వెళ్ళి రోగులకు సేవచేసి, బాధ నివారణ చేసే డాక్టరే ధన్యుడు. అటువంటి త్యాగబుద్ధి, చిత్తశుద్ధిగల డాక్టర్లకు భగవంతుని అనుగ్రహం పరిపూర్ణంగా ఉంటుంది.... అందుకే ఒక్కొక్క డాక్టరు హస్తం అమృత హస్తం అంటుంటారు...."

ఇంటి కొస్తూనే మా అత్తగారు హడావిడిగా మేడమీది కెళ్ళారు. మాకు గాభరా కలిగింది. నేనూ, మా బావగారూ ఆమె వెనకాలే వెళ్ళాం. అప్పుడే మావాడు తను తెచ్చిన అస్థిపంజరాన్ని ముందేసుకుని పుస్తకంలో ఉన్న పుర్రెనూ, అసలు పుర్రెనూ జాగ్రత్తగా పరీక్షిస్తున్నాడు....మా అత్త గారు వెళ్తూనే ముందు అస్థిపంజరానికి భక్తిగా నమస్కారం చేసి, మూడు సార్లు చెంపలు వాయించుకున్నారు. ఆ తర్వాత మనవడి బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకుని, వాడి వీపు నిమురుతూ, "నా తండ్రి, నా దేవుడు.... నువ్వు చదివేదే గొప్ప చదువురా తక్కువుందని.... తెలీక ఏమిటో అనుకున్నాను.... మా నాయన! దీర్ఘాయుష్మంతుడివై, నూరు కాలాలపాటు బీదా బిక్కీకి సహాయంచేస్తూ గొప్ప డాక్టరు వనిపించుకోవాలి...." అంటూ మా అత్త గారు ఆనందపడిపోతుంటే ఆమెలో కలిగిన మార్పుకు నిర్ఘాంతపడిపోయి, ఏం జరిగిందో తెలీక మావాడు అయోమయావస్థలో మావైపు చూశాడు వాణ్ణిచూసి నవ్వుతూ, "తర్వాత చెప్తానోయ్" అన్నారు సౌండ్‌లేని లిప్ మూమెంట్‌తో, మా బావగారు.